క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాల గోడలకు జనసేన బ్యానర్లు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ, జనసేన పార్టీలలో కొంత మంది నాయకులు చేస్తున్న అత్యుత్సాహానికి అడ్డుఅదుపులేకుండా పోతుంది. న్యూరాజరాజేశ్వరీపేటలో కేర్ అండ్‌షేర్ ప్రభుత్వ హైస్కూల్ గోడలకే ఏకంగా జనసేన బ్యానర్లు కట్టి స్థానిక నాయకులు హడావుడి చేస్తున్నారు. ప్రభుత్వ భవనాల ముందు ఇలా పార్టీ బ్యానర్లు పెట్టకూడదని చెబుతుంటే తమ నాయకుడి పుట్టినరోజుకు వేశామని, తీస్తే ఊరుకోమంటూ అధికారులు, పోలీసులను సైతం వారు బెదిరిస్తున్నట్లు తెలిసింది. పోనీ పుట్టినరోజు జరిగి కూడా రెండు వారాలు పూర్తయ్యిందని ఇన్ని రోజులు ఎలా ఉంచుతారని అడుగుతుంటే అధికారులపై దురుసుగా ప్రవరిస్తున్నారని, చేతిలో అధికారం ఉంటే ఏమైనా చేస్తారా అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించడమే కాకుండా అధికారులను సైతం బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకొని, బ్యానర్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

3న షిర్డీసాయిబాబా పుణ్యతిథి మహోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో వచ్చే నెల 3వ తేదీన షిర్డీ సాయినాథుని పుణ్య తిథి మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు సోమవారం ఓ ప్రకటన తెలిపారు. 3వ తేదీన బాబాకు ప్రత్యేక పూజలు, అర్చనలు జరుగుతాయన్నారు.

వేధింపులపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): తనను, తన ఇద్దరు కుమార్తెలను వేధింపులకు గురిచేస్తున్నట్లు ఓ మహిళ చేసిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు, నున్న గ్రామంలో తన ఇద్దరు కుమార్తెలతో నివాసం ఉంటున్న మహిళ ఆగిరిపల్లికి చెందిన రవి కుమార్ అలియాస్ రవికిరణ్‌తో గతంలో సహజీవనం చేసింది. అతని ప్రవర్తన సరిగా లేకపోవడంతో దూరం పెట్టింది. అయినప్పటికీ తనను, తన కుమార్తెలను వేధింపులకు గురిచేస్తున్నట్లు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పు చెల్లించాలని కొట్టిన వ్యక్తిపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): అప్పు తీసుకున్న డబ్బులు వడ్డీతో ప్రతి నెలా చెల్లిస్తున్నా దాడి చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు నున్న గ్రామానికి చెందిన మాళావత్ నాగరాజు కోడిగుడ్ల వ్యాపారం చేస్తుంటాడు. వ్యాపారం నిమిత్తం కలకోటి కోటిరెడ్డి దగ్గర 2018వ సంవత్సరంలో రూ.30 వేలను అప్పుగా తీసుకొని ప్రతి నెలా వడ్డీ చెల్లిస్తున్నాడు. అయినప్పటికీ రూ.60 వేలు కట్టవలసి ఉందని ఈ నెల 9న నున్న కోటకట్ట సెంటర్ వద్ద కలెక్షన్ చేసి వస్తున్న తనను కోటిరెడ్డి అడ్డగించి తన స్కూటీని తీసుకున్నాడని, స్కూటీలో 30 వేల నగదు ఉందని ఫిర్యాది తెలిపాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రణాళిక విభాగం అధికారుల సమస్యలు పరిష్కరించాలని వినతి

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో వివిధ స్థానిక సంస్థల్లో పట్టణ ప్రణాళిక విభాగం విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం ఆయన టౌన్ ప్లానింగ్ సంచాలకులుగా ఉద్యోగోన్నతి పొందిన బి.శ్రీనివాసరావు, నాగ సుందరికి మర్యాద పూర్వకంగా అభినందనలు తెలిపి సిబ్బంది సమస్యలను విన్నవించారు. రాష్ట్రంలో ప్రణాళిక విభాగం సిబ్బందిపై దాడులు పెరుగుతున్నాయని, ప్రమోషన్లలో నెలకొన్న సాంకేతిక సమస్యలను కూడా పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పి.మోహన్‌బాబు, పి.నాయుడు, జి.వెంకటేశ్వరరావు, మతీన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం సామాజిక నేరం

విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని విద్యుత్ విజిలెన్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.విజయకుమారి అన్నారు. పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో 47 బృందాలతో సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 47 మంది అధికారులు, 42 మంది సిబ్బంది 47 బృందాలుగా ఏర్పడి 3,380 సర్వీసులు తనిఖీ చేసి అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 229 మంది నుంచి 8 లక్షల 5 వేల రూపాయల అపరాధ రుసుం విధించామన్నారు. విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత విద్యుత్ చట్టానికి లోబడి ఉంటాయన్నారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను 83310 20537, 83310 14951 నంబర్లకు నేరుగా లేదా, వాట్సాప్ ద్వారా సంప్రదించాలని తెలిపారు.

కలెక్టర్ ఆదేశించినా కానరాని మార్పు

- న్యూఆర్‌ఆర్‌పేట డయేరియా ప్రాంతంలో అదే నిర్లక్ష్య ధోరణి
- మళ్లీ ఇష్టం వచ్చినట్లుగా పడేస్తున్న చెత్తాచెదారాలు
- పదుల సంఖ్యలో పందులు సంచారం



కలెక్టర్ లక్ష్మీశకు సమస్యలు వివరిస్తున్న స్థానిక ప్రజలు



11వ తేదీన జేసీబీలతో బాగుచేసిన ప్రదేశంలో మళ్లీ దర్శనమిస్తున్న చెత్తకుప్పలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): 'న్యూరాజరాజేశ్వరీపేట డయేరియా ప్రాంతంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి.. నివాసాల మధ్య పందుల సమస్య లేకుండా చూడాలి.. పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ.. చెత్తా, చెదారాలు లేకుండా జాగ్రత్తలు పాటించాలి..' అంటూ ఐదు రోజుల క్రితం కలెక్టర్ లక్ష్మీశ సంబంధిత కార్పొరేషన్ అధికారులకు ఆదేశించారు. మూడు రోజుల క్రితం డయేరియా ప్రాంతంలో పర్యటించిన కలెక్టర్ లక్ష్మీశ, కార్పొరేషన్ కమీషనర్ ధ్యానచంద్రకు స్థానిక ప్రజలు కూడా ఇవే సమస్యలను వారికి ప్రత్యక్షంగా చూపిస్తూ తమ గోడును తెలుపుకున్నారు. దీంతో అక్కడి పరిస్థితులను కళ్లారా వీక్షించిన కలెక్టర్ కార్పొరేషన్ అధికారులకు మరోసారి పందులు, తాగునీరు, డ్రెయినేజీ, చెత్త సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించి వెళ్లారు. అయితే కలెక్టర్ ఆదేశించి మూడు రోజులు గడిచిన తరువాత కూడా న్యూఆర్‌ఆర్‌పేటలో పరిస్థితులేవి చక్కబడడం లేదు.. మార్పు ఏమీ కానరావడం లేదు.

మళ్లీ చెత్తా, చెదారాలు, పందులు

న్యూరాజరాజేశ్వరీపేటలో డయేరియా సమస్య తలెత్తిన వెంటనే ఈ నెల 11వ తేదీన న్యూఆర్‌ఆర్‌పేట వంతెన పక్కన ఉన్న చెత్తకుప్పలు ఎత్తివేయించి మొత్తం మట్టిపోసి శుభ్రం చేయించారు. కలెక్టర్, కమిషనర్‌తో పాటు ఇతర అధికార యంత్రాంగం



న్యూఆర్‌ఆర్‌పేట ప్రధాన రహదారి వెంట ఇంకా సంచరిస్తున్న పందులు

వస్తుండడంతో మూడు రోజుల పాటు అక్కడ పరిస్థితులు బాగానే ఉన్నా నాలుగో రోజు మళ్లీ యధారాజా.. తథా సిబ్బంది.. అనే విధంగా ఎక్కడైతే మొత్తం శుభ్రం చేయించి మట్టి పోయించారో సోమవారం అదే ప్రాంతంలో చెత్తకుప్పలు, పదుల సంఖ్యలో పందులు దర్శనమిచ్చాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, తమ ప్రాణాలను.. ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నిర్లక్ష్యం వీడితేనే మేలుకొనేది

ప్రస్తుతం న్యూరాజరాజేశ్వరీపేటలో 'డయేరియా' బాధితుల సంఖ్య ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పడుతోంది. ప్రస్తుతం ఏ విధంగా అయితే అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పని చేశారో అదే విధంగా మరో వారం పది రోజుల పాటైనా విధులు నిర్వహిస్తే తప్ప డయేరియా వ్యాప్తి చెందకుండా ఉండడంతో పాటు పూర్తిగా అదుపులోకి వచ్చే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. కానీ అధికారులు, సిబ్బంది మళ్లీ యథావిధిగా అదే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే 'డయేరియా' వ్యాప్తి చెందే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వ అధికారులు, సిబ్బంది కన్నా ముఖ్యంగా ప్రజలు కూడా తమ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని.. ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారాలు వేయకూడదని.. కాచి చల్లార్చిన నీటినే తాగాలని.. బయట ఆహారాన్ని, నిల్వ ఉన్న భోజనాలను కాకుండా ఇళ్లల్లో వండుకొని వేడిగా తీసుకోవడం ఉత్తమమని సూచిస్తున్నారు.



ఎన్నిసార్లు మొత్తుకున్నా పట్టించుకోరు..

మా అపార్ట్‌మెంట్‌ల వద్ద గతేడాది నుంచి అధ్వానమైన పరిస్థితులు ఉన్నాయి. అన్ని డ్రెయినేజీ పైపులు పగిలిపోయి మురుగంతా రోడ్లపైకే వచ్చేస్తుంది. అపార్ట్‌మెంట్‌ల చుట్టూ మురుగు, చెత్తా, చెదారాలే. దుర్వాసనలు, దోమలతో నిత్యం నరక యాతన అనుభవిస్తుంటాం. శానిటరీ అధికారులకు, సిబ్బందికి ఎన్నిసార్లు మొత్తుకున్నా ఒక్కరూ కూడా సరిగా పట్టించుకోరు.

– గోక లక్ష్మి, స్థానికురాలు



పాలకులు, ఉన్నతాధికారులు వచ్చినప్పుడే చర్యలు

ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు వస్తున్నారంటేనో.. లేదా ఇలా వరదలు, డయేరియా వచ్చి జనం చచ్చిపోతున్నారంటేనో తప్ప మామూలుగా మా సమస్యలను పట్టించుకునే నాథుడే ఉండడు. కనీసం ఇప్పటి నుంచి అయినా మా ప్రాంతాలను అభివృద్ధి చేసి.. మళ్లీ మాకు ఇటువంటి దుస్థితి రాకుండా ఉన్నతాధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– సీతమ్మ, స్థానికురాలు

జాడలేని కూటమి ప్రభుత్వ పాలకులు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): న్యూరాజరాజేశ్వరీపేటలో వందలాది మంది అతిసారకు గురైనా ఈ కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధుల్లో తగినంత స్పందన లేకపోవడం దారుణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు అన్నారు. పేటలోని వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను సీపీఎం నాయకులతో కలిసి సోమవారం ఆయన పరామర్శించారు. పేటలో ఇంకా అతిసార కేసులు ఆగడం లేదని.. వారం రోజులు గడుస్తున్నా ఇప్పటికి అతిసారకు ఈ ప్రభుత్వం కారణాలు గుర్తించలేకపోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు. నలుగురు మరణించడానికి, ఇన్ని వందల మంది హాస్పిటల్ పాలవ్వడానికి ప్రభుత్వం, నగర పాలక సంస్థే నైతిక బాధ్యత వహించాలన్నారు. వారం రోజులుగా న్యూఆర్‌ఆర్‌పేటలో కర్ఫ్యూ వాతావరణం ఏర్పడిందని, దుకాణాలు, పాఠశాలలు మూసివేయించారని స్థానిక ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. పనులు లేక, ఆహారం దొరక్క నిరుపేద ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని.. ప్రభుత్వం వీరికి ఆహారం అందించాలని, నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించాలని.. డయేరియాకు ప్రభుత్వం కారణాలు నిర్ధారించి వాస్తవాలను వెల్లడించడంతో పాటు బాధితుల కుటుంబాలకు ఆర్థికంగా సహాయం చేయాలని కోరారు. సీపీఎం నాయకులు బి.రమణారావు, కె.దుర్గారావు, సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేసీ ఇలక్కియ, అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుందని.. మహిళల ఆరోగ్యం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాయని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ఆమె వైద్య ఆరోగ్య శాఖ, వివిధ శాఖల అధికారులతో కలిసి స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. పుట్టిన ఆడ శిశువు మొదలు మహిళలందరి ఆరోగ్య సంరక్షణకు కేంద్రం ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ నెల 17న దేశ ప్రధాని ఈ పథకాన్ని ప్రారంభిస్తారని.. అదే రోజు ఎన్టీఆర్ జిల్లాలోనూ ఈ కార్యక్రమం ప్రారంభిస్తామని చెప్పారు. అక్టోబర్ రెండో తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా క్యాంపుల ద్వారా మహిళల ఆరోగ్య సమస్యలపై స్పెషలిస్ట్ డాక్టర్లతో పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరాల్లో అందించే వైద్య సేవలు మహిళల్లో గుండె జబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షల నిర్వహణ తగిన వైద్య చికిత్సలు, రిఫరల్ సేవలను అందిస్తారు. అలాగే మహిళలు, కిశోర బాలికల్లో రక్తహీనతను గుర్తించి తగిన చికిత్సలను అందిస్తారు. గర్భిణులను పరీక్షించి సరైన పోషకాహారం ఆవశ్యకతను, తీసుకోవల్సిన జాగ్రత్తలపై కౌన్సెలింగ్ ఇస్తారు. చిన్నారులు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు అందజేయడం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం, ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులు అందించడం, ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా జరిగే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని తెలిపారు.

దసరా ఉత్సవ మొబైల్ యాప్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాల నేపథ్యంలో దేవస్థానం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. దసరా ఉత్సవాలు 2025 పేరిట రూపొందించిన ఈ యాప్‌ను సోమవారం దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ రూపొందించిన ఈ యాప్‌ను ప్లేస్టోర్, యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. అమ్మవారి దర్శన వేళలు, రోజు వారి సేవలు, వీఐపీ దర్శన సమయాలు, అమ్మవారి అలంకారాలు, అలంకారం వివరాలు, ఫొటోలు, సేవా బుకింగ్, ఆయా సేవల ప్రత్యక్ష ప్రచారం భక్తులకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అమ్మవారి లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాలు, ఉచిత అన్న ప్రసాద వితరణ, రవాణా సదుపాయం, దేవస్థాన బస్సుల వివరాలు కూడా తెలుసుకోవచ్చన్నారు. అత్యవసర సమయాలలో ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, పోలీసు వారి సేవలు, అగ్నిమాపక కేంద్రాలు, హాస్పిటల్ లొకేషన్లు భక్తులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ యాప్‌లో మొత్తం 15 అంశాలతో కూడిన వివరాలను భక్తులు తెలుసుకోవచ్చన్నారు. ఇక వాట్సాప్ నంబరు 9441820717 ద్వారా ఏఐ ఆధారిత సంభాషణ, యాత్రికులకు ఎటువంటి సమాచారం కావాలన్నా తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో దుర్గగుడి ఈవో శీనానాయక్, సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి



నగర వాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ నగర వాసులకు కల్పిస్తున్న మౌలిక వసతుల్లో ఎలాంటి అవాంతరాలు రాకుండా చర్యలు తీసుకోవాలని వీఎంసీ అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమంలో ఆయన నగర వాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించాలని, ఫిర్యాదుదారులకు సంతృప్తికరమైన పరిష్కారం అందించాలన్నారు. కార్యక్రమంలో మొత్తం 16 ఫిర్యాదులు రాగా అందులో పట్టణ ప్రణాళిక 6, ఇంజినీరింగ్ 8, పబ్లిక్ హెల్త్, రెవెన్యూ విభాగానికి ఒక్కో ఫిర్యాదు అందిందన్నారు. జాయింట్ డైరెక్టర్(అమృత్) డాక్టర్ లత తదితరులు పాల్గొన్నారు.

పేటలో గందరగోళం సృష్టిస్తున్న పుకార్లు



పేటలో వాటర్ ట్యాంక్ వద్ద పరిస్థితులను పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అసలే డయేరియా సమస్యలతో సతమతమవుతున్న న్యూరాజరాజేశ్వరీపేటపై కొంతమంది ఆకతాయిలు అసత్య ఆరోపణలతో విష ప్రచారాలు చేస్తున్నారు. న్యూఆర్‌ఆర్ పేటలోని వాటర్ ట్యాంక్‌లో మనిషి చనిపోయాడని.. ఆ నీరు తాగడం వల్లే డయేరియా సమస్య వచ్చిందని.. వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తుండగా అధికారులు ఈ విషయాన్ని గుర్తించారంటూ కొంతమంది ఆకతాయిలు విష ప్రచారం చేస్తున్నారు. రెండు రోజుల నుంచి ఈ వార్త ఆ నోట ఈ నోట పడడంతో ప్రజలంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

పుకార్లు నమ్మవద్దు..

నగరంలో ఎప్పుడు ఇటువంటి ఘటనలు ఎక్కడా జరగలేదని.. ఇలాంటి పుకార్లు, అసత్య ప్రచారాలను ప్రజలెవరూ నమ్మవద్దని కార్పొరేషన్ ఈఈ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి వాటర్ ట్యాంక్ వద్ద రక్షణగా సెక్యూరిటీ గార్డులు ఉంటారని.. ట్యాంక్‌పైకి ఎక్కేందుకు అసలు ఎవరికి అనుమతి ఉండదని వివరించారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి.. అవసరమైతే ఇలా విష ప్రచారం చేసే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు

అసత్య ప్రచారాలు చేస్తూ నగర ప్రజలను గందరగోళానికి.. ఆందోళనకు గురిచేయడం సరి కాదని.. ఇటువంటి వారిపై సుమోటోగా కేసులు తీసుకొని అయినా వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఏకకాలంలో ఎన్నికలు జరిగితేనే అభివృద్ధికి బాటలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): దేశ వ్యాప్తంగా ఏకకాలంలో ఎన్నికలు జరిగితేనే అభివృద్ధికి బాటలు పడతాయని బీజేపీ జాతీయ కార్యదర్శి అనిల్ ఆంటోనీ, జాతీయ అధికార ప్రతినిధి సయ్యద్ జాఫర్ ఇస్లాం అన్నారు. పండిట్‌నెహ్రూ బస్టాండ్ సమీపంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ అభియాన్ రాష్ట్ర కన్వీనర్ వేటుకూరి సూర్యనారాయణరాజు అధ్యక్షతన సోమవారం రాష్ట్రస్థాయిలో ఎంపిక చేసిన విద్యార్థి నాయకులతో వన్ నేషన్ వన్ ఎలక్షన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆంటోనీ, జాఫర్ మాట్లాడుతూ.. వన్ నేషన్ వన్ ఎలక్షన్ దేశానికి కొత్త కాదని, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 1967 వరకు దేశంలో అసెంబ్లీ, పార్లమెంట్‌కు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించారన్నారు. ప్రతి సంవత్సరం ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించడం వలన ఉద్యోగుల బాధ్యతలు ఎన్నికల నిర్వహణకే పరిమితం అవుతున్నాయన్నారు. ఎన్నికల కోడ్ వలన దేశంలో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోతున్నాయని తెలిపారు. ఏకకాలంలో ఎన్నికలు జరగకపోవడంతో ప్రజాధనం అధికంగా ఖర్చు అవుతుందని, ఏకకాలంలో జరిగితే ఖర్చు ఆదా అవడంతో ఆ సొమ్మును ప్రజావసరాలకు వాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఆర్గనైజేషనల్ సెక్రటరీ మధుకర్ జీ తదితరులు పాల్గొన్నారు.

వీఎంసీ ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



జక్కంపూడి కాలనీలో పర్యటిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో వీఎంసీ నిర్వహణలో ఉండే ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం ఉదయం జక్కంపూడి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో వీఎంసీ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి శుద్ధమైన తాగునీటి సరఫరా అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జక్కంపూడి కాలనీలో డ్రెయినేజీల వద్ద వాటర్ లైన్ లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనధికార కట్టడాలను తొలగించాలని, దోమలు పెరగకుండా యాంటీ లార్వే ఆపరేషన్లు నిర్వహించి ప్రతి రోజు ఫాగింగ్, ఎంఎల్ ఆయిల్ స్ప్రే, డ్రోన్ ద్వారా ఖాళీ స్థలాల్లో, డ్రెయిన్లలో, కాలువల్లో ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేయించాలన్నారు. జక్కంపూడి కాలనీలో ఉన్న బోర్లకు నీటి పరీక్షలు నిర్వహించాలని, ప్రైవేట్ ఆర్వో ప్లాంట్లన్నింటిలోనూ తాగునీటి పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అర్జునరావు, పర్యవేక్షణ ఇంజినీర్ పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన డయేరియా



జ్వర బాధితులను జీజీహెచ్ తరలిస్తున్న సిబ్బంది

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): న్యూరాజరాజేశ్వరీపేటలో డయేరియా కేసులు తగ్గుముఖం పట్టాయి. గత వారం రోజుల నుంచి నగర ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేసిన 'డయేరియా' ఆరో రోజుకు కాస్త అదుపులోకి వచ్చింది. కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకూ జిల్లా అధికార యంత్రాంగం అహర్నిషలు కష్టపడుతుండడతో న్యూఆర్‌ఆర్‌పేటలో పరిస్థితులు ఇప్పుడిప్పుడే చక్కబడుతున్నాయి. సోమవారం న్యూఆర్‌ఆర్‌పేట నుంచి ప్రభుత్వ హాస్పిటల్‌లో డయేరియా సమస్యలతో 36 మంది చేరగా వారిలో 21 మంది పెద్దవారు, 15 మంది చిన్నపిల్లలు ఉన్నారు. అలానే న్యూరాజరాజేశ్వరీపేట కేర్ అండ్ షేర్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో 16 మంది డయేరియా లక్షణాలతో బాధపడుతూ చికిత్స చేయించుకుంటున్నారు. న్యూఆర్‌ఆర్‌పేటలో 'డయేరియా' సమస్య అదుపులోకి రాగా జ్వరాల సమస్య కొత్తగా తెరపైకి వస్తుంది. ఈ ప్రాంతంలో సోమవారం 100 మంది వరకూ ఓపీ చూపించుకోగా వీరిలో అధికంగా జ్వరాలతో బాధపడే వారే ఉన్నారు. రెండు రోజుల నుంచి వైద్యం అందిస్తున్నా జ్వరాలు తగ్గకపోవడంతో కొంతమంది జ్వరపీడితులను మెడికల్ క్యాంపులోని వైద్యాధికారులు 108 వాహనాల ద్వారా మెరుగైన వైద్య సేవల కోసం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలిస్తున్నారు.

ఆయుర్వేద సంస్థలో హిందీ పక్షోత్సవాలు ప్రారంభం



హిందీ పక్షోత్సవాలను ప్రారంభిస్తున్న ఏడీ డాక్టర్ వెంకటేశ్వర్లు

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ, న్యూ రాజీవ్‌నగర్ నందు సీసీఆర్ఏఎస్, ఆయుష్ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో రాజభాష హిందీ పక్షోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. సంస్థ ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు జ్యోతి వెలిగించి పక్షోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజభాష హిందీ సంబంధిత పలు కార్యక్రమాలు దేశ భాషపై ఆసక్తిని, గౌరవాన్ని పెంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. సీనియర్ పరిశోధన అధికారి హిందీ పక్షోత్సవాల ముఖ్య లక్ష్యాలను వివరించారు. హిందీ భాషను కార్యాలయ పనితీరులో భాగంగా మార్చేందుకు ప్రోత్సహిత కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. మరో పరిశోధన అధికారి డాక్టర్ సవిత మాట్లాడుతూ.. హిందీ వ్యాస రచన, డిబేట్, పద్యపఠనం, క్విజ్ వంటి పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పరిశోధన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా నీటి పరీక్షలు చేయించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలో వాటర్‌ప్లాంట్ల యజమానులు క్రమం తప్పకుండా నీటి పరీక్షలు చేయించాలని వీఎంసీ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు సూచించారు. మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రైవేట్ ఆర్వో వాటర్ ప్లాంట్స్ యజమానులు, చికెన్–మటన్, సీ ఫుడ్స్ విక్రయదారులు, హోటల్స్, రెస్టారెంట్స్, క్యాటరర్స్‌తో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. అర్జునరావు మాట్లాడుతూ నగరంలో డయేరియా, విషజ్వరాలు ప్రబలిన నేపథ్యంలో ప్రైవేట్ ఆర్వో ప్లాంట్స్ నిర్వాహకులు ని, కెమికల్ ఎనాలసిస్ (టీడీఎస్, పీహెచ్, నైట్రేట్స్, క్లోరినేషన్), బయాలజికల్ టెస్ట్‌లు (మైక్రోస్, వైరల్) తప్పకుండా చేయించాలన్నారు. షాపులు, హోటళ్లలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు. డస్ట్‌బిన్లు వినియోగించకుండా వ్యర్థాలను రోడ్లపై పడేసేవారికి భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ట్రేడ్ లైసెన్స్‌లో వ్యాపారస్తులు ఇస్తున్న డిక్లరేషన్‌ను పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. సమావేశంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, డిప్యూటీ కమిషనర్, ట్రేడ్ అండ్ లేబర్ ఆఫీసర్ ధనలక్ష్మి, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఏలూరు రోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖాధికారులు తెలిపారు. ఎమ్మార్వో ఆఫీస్ ఏరియా, ఐఎంఏ హాల్ ఏరియా, ప్రకాశం రోడ్డు, శివాలయం వీధి, మసీదు వీధి, కాజా పున్నయ్య వీధి, అట్లూ రత్తయ్య వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

గట్కా పోటీలో శ్యామ్‌మనోహర్‌కు గోల్డ్ మెడల్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ రాష్ట్ర గట్కా ఛాంపియన్‌షిప్ పోటీలో విద్యాధరపురం రామరాజ్యనగర్‌కు చెందిన పులిపాటి శ్యామ్ మనోహర్‌కుమార్ బంగారు పతకం సాధించాడు. జాతీయ గట్కా అసోసియేషన్ ఆఫ్ ఇండియా అనుబంధ సంస్థ ఏపీ గట్కా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో విజయవాడ లయోలా కాలేజీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలో అండర్–8 విభాగంలో శ్యామ్ మనోహర్ కుమార్ గోల్డ్ మెడల్ సాధించాడు. విజయవాడలోని లిటిల్ బ్రెయిన్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్న శ్యామ్ రెండేళ్లుగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గట్కా క్రీడలో శిక్షణ పొందుతున్నాడు. రామరాజ్యనగర్‌లోని శ్రీకృష్ణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, హోమియో వైద్యులు పులిపాటి వెంకటేశ్వరరావు, తల్లిదండ్రులు వంశీకృష్ణ, ప్రియాంక, నిర్వాహకులు శ్యామ్‌మనోహర్‌కుమార్‌ను అభినందించారు.